నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
15 | హైదరాబాద్, ఆదివారం 11 ఫిబ్రవరి 2024 | YADADRI BHUVANAGIRI

భూదాన్ పోచంపల్లిలో మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు, వేదికపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

తెలంగాణ హక్కులను కాపాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్

- ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పి రాష్ట్ర హక్కులను కాలరాయొద్దు
- చలో నల్లగొండ సభకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలి
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ రామకృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు కంచర్ల

బీబీనగర్/భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 10 : రాష్ట్ర హక్కులను కాపాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని, ప్రాజెక్టులన్నింటినీ కేఆర్ఎంబీకి అప్పజెప్పి రాష్ట్ర హక్కులను కాలరాయొద్దని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జీవీ రామకృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం బీబీనగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో, అనంతరం భూదాన్ పోచంపల్లి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, నెట్టెంపాడుతోపాటు ఇతర జలాశయాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అంగీకరించి సంతకం చేసి రైతుల హక్కులను కాలరాశారని పేర్కొన్నారు. కేఆర్ఎంబీకి అప్పగించడమే కాకుండా బీఆర్ఎస్‌ను బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే ఈ ప్రాంత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, కేంద్ర ప్రభుత్వం అనుమతి లేనిదే అక్కడ ఏం చేయలేని పరిస్థితి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో రైతులకు అన్యాయం జరుగకుండా ఉండేందుకు, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చలో నల్లగొండ సభ నిర్వహిస్తున్నారని, భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేసీఆర్ ప్రజా ఉద్యమాన్ని చేపట్టారన్నారు. సాధించుకున్న హక్కులను హరించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని మరిచి ఒక సర్పంచ్‌లా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన పథకాలను సీఎం రేవంత్ రద్దు చేస్తాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నల్లగొండలో 13న నిర్వహించే సభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి, ఎంపీపీలు యర్కల సుధాకర్‌గౌడ్, మాడుగుల ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రాచమల్ల శ్రీనివాసులు, పాటి సుధాకర్ రెడ్డి, కార్యదర్శులు సీత వెంకటేశం, చింతల సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి, పోచంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్ సామల మల్లారెడ్డి, రైతుబంధు సమితి మండల కో ఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, నాయకులు కొణతం భాస్కర్‌గౌడ్, మంచాల రవికుమార్, గాండ్ల రవి, శ్రీనివాస్, దస్తగిరి, ముత్యాల మైపాల్ రెడ్డి, పగిళ్ల సుధాకర్ రెడ్డి, దొడ్డమోని చంద్రం, చిట్టిపోలు శ్రీనివాస్, సామ రవీందర్ రెడ్డి, గోరంటి శ్రీనివాస్ రెడ్డి, నోముల మాధవరెడ్డి, చిలువేరు బాల నరసింహ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్-65ని ఆరులైన్లుగా విస్తరించాలి

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, ఫిబ్రవరి 10 : కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలోని ఆయన నివాసంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ శనివారం కలిశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ 65ను మల్కాపూర్ నుంచి నందిగామ వరకు సూర్యాపేట మీదుగా అరు లైన్లు కలిగిన రోడ్డుగా వెంటనే విస్తరించాలని కోరారు. ప్రమాద హెచ్చరికలు కలిపి(బ్లాక్ స్పాట్స్ 17) మునుగోడు, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ వరకు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా ధర్మోజిగూడెం నుంచి ఎల్లగిరి వరకు కొత్త సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్‌హెచ్ -65 మల్కాపూర్ నుంచి నందిగామ వరకు అండర్ పాస్‌లు, అలాగే జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీని వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ అందిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడం అంటే మన హక్కులను కోల్పోవడమే

- అనుభవం లేకుండా, సీనియర్ల సలహాలు తీసుకోకుండా సంతకాలు చేశారు
- కాంగ్రెస్ 60 ఏండ్ల విధ్వంస పాలనను పదేండ్లలో సరిచేసినం
- రైతాంగానికి జరిగే అన్యాయాన్ని ఎదురించేందుకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలి
- నల్లగొండ బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రవీంద్రసింగ్, చెరుకు సుధాకర్, పల్లె రవి కుమార్, తండు సైదులు గౌడ్ తదితరులు

నీలగిరి, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్రం కోసం కొట్లాడింది నీళ్లు, నిధులు, నియామకాల కోసమమని, కృష్ణా నీటిలో మన వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం అంటే మన హక్కులను కోల్పోవడమేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 13న నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ రోడ్‌లో జరుగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నల్లగొండ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 60 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ విధ్వంస పాలనను సరిచేస్తూ కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగిందన్నారు. కృష్ణా నీటిపై కేంద్రానికి అన్ని హక్కులు పోయి, ఆఖరికి మంచినీటిని కూడా మనం సొంతంగా వాడుకునే హక్కు ఉండదని తెలిపారు. ఇది తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. అనుభవం లేని ముఖ్యమంత్రి, మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, సీనియర్లు అనుభవజ్ఞుల సలహాలు తీసుకోకుండా కేఆర్ఎంబీ మీద సంతకాలు చేశారని విమర్శించారు. శాసన సభలో కూడా వాళ్లు మాట్లాడేది మాట్లాడి బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు అవకాశం లేకుండా చేస్తూ నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ కోసం, తెలంగాణ హక్కుల కోసం కొట్లాడేది కేసీఆర్ మాత్రమేనని మరోసారి నిరూపితమయ్యిందని చెప్పారు. తమ బతుకులు బాగుపడతాయని ప్రజలు నమ్మి అధికారం అప్పగిస్తే ఆగం చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. అనుభవ లేమి, ప్రతీకార ధోరణి, కక్షపూరిత పద్ధతుల్లో సాగిస్తున్న పరిపాలన వల్ల ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. తెలంగాణ హక్కులను ఇతరులకు తాకట్టు పెట్టే పద్ధతిలో వారి వ్యవహార శైలి సాగుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల జరుగబోయే ప్రమాదాన్ని ప్రజలు, రైతులకు చెప్పాలనే నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మూడు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఈ సభను నల్లగొండలో ఏర్పాటు చేస్తున్నందున, స్థానిక నాయకులు, రైతులు ఒక సవాలుగా స్వీకరించి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్, కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, నల్లగొండ నియోజక వర్గం పార్టీ పరిశీలకుడు, వరంగల్ మాజీ మేయర్ రవీంద్ర సింగ్, మాజీ ఆర్ఓ శరణ్యారెడ్డి, కనగల్ ఎంపీపీ ఎస్కే కరీం పాషా, జడ్పీటీసీ చిట్ల వెంకటేశం, తిప్పర్తి మాజీ జడ్పీటీసీ తండు సైదులు గౌడ్, నల్లగొండ మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షం, సింగిల్ విండో చైర్మన్లు వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు బకరం వెంకన్న, తిప్పర్తి, కనగల్, నల్లగొండ మండల పార్టీ అధ్యక్షులు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, అయితగోని యాదయ్య, దేప వెంకట్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, ప్రధాన కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు కమిటీలు అనుబంధ సంఘాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

కృష్ణా జలాల్లో వాటా తేల్చే వరకూ ఉద్యమిస్తాం

- మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు,

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : తెలంగాణకు కృష్ణాజలాల వాటాను తేల్చే వరకు మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమాన్ని ఆపేదిలేదని మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తేల్చిచెప్పారు. గుట్టచప్పుడుగా కృష్ణాజలాలను సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రానికి అప్పగించి పాలమూరు, రంగారెడ్డి, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలను ఏడారిగా మారుస్తామంటే ఊరుకునేది లేదన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్‌తో కలిసి ఈ నెల 13న నల్లగొండలో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నల్లగొండ సభకు ఆలేరు నియోజకవర్గం నుంచి 12 వేల మందిని తరలిస్తామన్నారు. 13న ఉదయం 10 గంటలకే నల్లగొండకు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కృష్ణా జలాల్లో 75 శాతం వాటా మనకే చెందుతుందని బచావత్ ట్రిబ్యునల్ చెప్పినా అమలు చేయలేదన్నారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశాక ఇప్పటి వరకు కృషాజలాల వాటపై తేల్చకుండా తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్ర ప్రభుత్వానికి తొత్తుగా మారి రాష్ట్ర హక్కులు, వాటాలను రాసిస్తున్నారని మండిపడ్డారు. 10 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో నదీజలాల గొడవలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు నెల్లలోనే కృష్ణాజలాలను కేంద్రానికి రాసిచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణాజలాలను తీసుకొచ్చి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చాల్సిందిపోయి కేంద్రానికి అప్పగించడంపై మండిపడ్డారు. కాంగెస్ అధికారంలోని రాగానే జనవరి 17న కేంద్ర ప్రభుత్వ సంస్థ కేఆర్ఎంబీకి అప్పగించిందని ఆరోపించారు. నల్లగొండ జిల్లా రైతాంగాన్ని దీనిపై ఆలోచింపజేసి కృష్ణాజలాలను రాబట్టేందుకే మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండ వేదికగా ఉద్యమానికి తెర తీశారని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగం స్వచ్ఛందంగా తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రాంతానికి అధిక వాటా రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి జల వివాదానికి తెర లేపిందని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతి రైతు అండగా నిలువాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కాకముందే రైతులను అరిగోస పెడుతుందన్నారు. సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, బీఆర్ఎస్ వివిధ మండలాల అధ్యక్షులు కర్రె వెంకటయ్య, బీసు చందర్‌గౌడ్, బొట్ల యాదయ్య, నరేందర్‌రెడ్డి, గంగుల శ్రీనివాస్, జడ్పీటీసీలు పల్లా వెంకట్‌రెడ్డి, తోటకూరి అనూరాధ, గోపాల్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్, నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలు శనివారం రెండోరోజు కొనసాగాయి. 14 లీగ్ మ్యాచ్‌లు నిర్వహించారు. రెండు రోజుల నుంచి నిర్వహించిన లీగ్ మ్యాచ్‌లకు ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేయనున్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా విద్యుత్ ఎస్ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్ హాజరయ్యారు.

దర్బార్ సేవలో భాగంగా స్వామి వారికి నక్షత్ర హారతినిస్తున్న ప్రధానార్చకుడు కాండూరి వేంకటాచార్యులు

యాదగిరీశుడికి దర్బార్ సేవ

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి దర్బార్ సేవోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించారు. నాలుగు వేదాలు స్వామివారికి పారాయణం చేసి, స్వామివారి స్వస్తి మంత్రార్థ వంటి మంత్రాలతో శాంతిపజేశారు. నక్షత్రహారతిని ఇచ్చి స్వామివారిని కొలిచారు. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో మేల్కొలిపారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సుమారు గంటన్నరకు పైగా జరిగిన నిత్యతిరు కల్యాణ తంతును భక్తులు వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 24,18,100 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్. రామకృష్ణారావు తెలిపారు.

సాంఘిక సంక్షేమ పాఠశాలల చీఫ్ సూపరింటెండెంట్లతో మాట్లాడుతున్న ఏసీ ఎ.భాస్కర్‌రావు

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

- పకడ్బందీగా నిర్వహించాలి : అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 10 : సాంఘిక సంక్షేమ గురుకుల ఐదో తరగతి ప్రవేశ పరీక్షను ఆదివారం జిల్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుంది. భువనగిరిలో 360, రాజాపేటలో 336, అడ్డగూడూరులో 360, ఆలేరులో 312, చౌటుప్పల్‌లో 360, వలిగొండలో 362, వలిగొండ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 240 మంది కలిపి మొత్తం 2,330 మంది విద్యార్థుల పరీక్షకు హాజరుకానున్నారు. ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టరు ఎ.భాస్కర రావు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు.

శనివారం తన చాంబర్‌లో రీజనల్ కో-ఆర్డినేటరు శ్రీరాం శ్రీనివాస్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లతో పరీక్షా ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె.పార్థసింహారెడ్డి, ఉన్నారు.

యాదగిరి నర్సన్నను మర్చింద్రు

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి

- లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రస్తావనే లేదు
- 2022లో రూ.350 కోట్లు.. 2023లో రూ.200 కోట్ల కేటాయింపు
- టూరిజం సర్క్యూట్‌లో యాదగిరిగుట్ట ఏది?
- పవిత్ర పుణ్యక్షేత్రాల్లో ఇల వైకుంఠాన్ని చేర్చలే..
- బస్వాపూర్ ప్రాజెక్ట్‌ను పట్టించుకోలే..
- రూ. 500 కోట్లు కావాలన్నా కనికరించలే..
- రీజినల్ రింగ్ రోడ్డుపై మరింత స్పీడప్!

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు పైసా ఇవ్వలేదు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న యాదాద్రి భువనగిరికి కాంగ్రెస్ సర్కారు మొండి చెయ్యే చూపించింది. తెలంగాణలోనే పెద్ద ఆలయమైన యాదగిరిగుట్ట ఆలయం గురించి బడ్జెట్ ప్రసంగంలో కనీసం ప్రస్తావించలేదు. టూరిజం సర్క్యూట్ అంటూ గొప్పలు చెప్పినా అందులోనూ మన గుట్టకు చోటు కల్పించలేదు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన బస్వాపూర్ ప్రాజెక్ట్‌నూ పట్టించుకోలేదు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌ను శరవేగంగా పూర్తి చేస్తామనడంతో రాయగిరి రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నది.

గుట్టకు పైసా ఇయ్యలే..

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లోనే యాదగిరిగుట్ట ఒకటి. తెలంగాణ వచ్చిన తర్వాత సుమారు రూ. 1200 కోట్లతో నాటి సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దారు. ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తూ ఎప్పటికప్పుడు ప్రాధాన్య క్రమంలో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేశారు.

టూరిజం సర్క్యూట్‌లో యాదగిరిగుట్ట ఏదీ..?

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క టూరిజం సర్క్యూట్‌పై ప్రసంగించారు. పవిత్ర పుణ్యక్షేత్రాలైన వేములవాడ, బాసర, భద్రాచలం, జమలాపురం (చిన్న తిరుపతి), ధర్మపురిని అనుసంధానం చేస్తూ టూరిజం సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ఆలయాలను మరింత ఆకర్షణీయంగా, భక్తులకు సౌకర్యవంతమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే టూరిజం సర్క్యూట్‌లో యాదగిరిగుట్ట లేకపోవడం గమనార్హం. అసలు బడ్జెట్‌లో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని మరిచిపోయారు. నిత్యం రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దర్శించుకుంటున్న యాదగిరిగుట్ట నర్సన్నను విస్మరించడంపై జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

2023 ఫిబ్రవరి 3న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వైటీడీఏకు రూ. 200 కోట్లు కేటాయించారు. 2022బడ్జెట్‌లో కూడా రూ. 350 కోట్లను ప్రతిపాదించారు. కానీ ఈ సారి యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం ఒక్క పైసా కూడా కేటాయించ లేదు. యాదగిరిగుట్ట పదమే ఎత్తకుండా బడ్జెట్ కొనసాగింది. పోయినసారి బడ్జెట్‌లో గవర్నర్ సౌందర రాజన్ సైతం తన బడ్జెట్ ప్రసంగంలో ఆలయ అభివృద్ధిపై ప్రశంసలు కురిపించారు. 'యాదగిరిగుట్ట ఆలయం పునర్నిర్మాణం ఒక చారిత్రాత్మక అద్భుతం. తెలంగాణ ప్రజల కొంగు బంగారమైన యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రభుత్వం వైభవోపేతంగా పునర్నిర్మించింది. అడుగడుగునా ఆధ్యాత్మిక భావం వెల్లివిరిసేలా ఆలయాన్ని తీర్చిదిద్దింది' అని గవర్నర్ కొనియాడారు.

బస్వాపూర్ ప్రాజెక్ట్‌ను పట్టించుకోలే..

జిల్లా రైతుల తలరాతను మార్చే బస్వాపూర్ ప్రాజెక్ట్ గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. తుది దశకు వచ్చిన ఈ ప్రాజెక్టుకు పట్టించుకుంటే యాదాద్రి భువనగిరి జిల్లాతోపాటు నల్లగొండలోని కొన్ని మండలాలకు సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్ట్‌కు తక్షణం రూ. 500 కోట్లు కావాలని ఇటీవల నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనిపై సర్కారు నుంచి ఉలుకుపలుకు లేదు. ముంపు ప్రాంతమైన బీఎన్ తిమ్మాపూర్‌కు రూ.150 కోట్లు, చొక్లానాయక్ తండాకు రూ. 100 కోట్లు కావాల్సి ఉంది. తొలుత ఈ రెండు గ్రామాలకు పరిహారం అందిస్తే రిజర్వాయర్ నింపే అవకాశం ఉంది.

ట్రిపుల్ ఆర్‌పై మరింత వేగం

రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం మరింత దూకుడుగా వెళ్తున్నట్లు కనిపిస్తున్నది. 'రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తి చేస్తాం. శరవేగంగా పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయిస్తాం' అని అసెంబ్లీలో భట్టి విక్రమార్క వ్యాఖ్యలు చేశారు. త్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో భాగంగా తమ భూములు పోతున్నాయని, అలైన్‌మెంట్ మార్చాలని రాయగిరి రైతులు పెద్దఎత్తున ఉద్యమం చేశారు. కోర్టులో కేసు వేసి, స్టే తెచ్చుకున్నారు. స్టే ఎత్తివేతకు ప్రభుత్వం తరపున పిటిషన్ కూడా దాఖలు చేశారు. ఎన్నికల ముందు మాత్రం అలైన్‌మెంట్ మారుస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు.

నిరుద్యోగ భృతి ఏమైంది..?

బడ్జెట్ ప్రసంగంలో నిరుద్యోగ భృతి ముచ్చటే లేదు. అధికారంలోకి వస్తే యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పదేపదే ప్రచారం చేసింది. హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. నిరుద్యోగ యువతకు నెలకు రూ. 4వేల చొప్పున ఇస్తామని స్వయంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హామీ ఇచ్చారు. యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ హామీకి నమ్మి ఓటేసిన యూత్ ఇప్పుడు ఆ పార్టీ నమ్మక ద్రోహం చేసినంత పనైంది. అసలు నిరుద్యోగ భృతి గురించే ప్రస్తావించకపోవడంపై యువత, నిరుద్యోగులు మండిపడుతున్నారు.